పెట్టుబడులకు ప్రయత్నిస్తం

తెలంగాణపై మాకుండే ప్రేమ, అభిమానం ఇంకెవరికీ ఉండవు: కేటీఆర్

- పెట్టుబడులకు ముందుకొచ్చే వారికి సహకారం అందించండి
- యూకే తెలుగు బిజినెస్ కౌన్సిల్ పారిశ్రామిక వేత్తలతో కేటీఆర్
- యూకేలోనూ బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలు ఘనంగా నిర్వహిస్తం
- ఏడాది పాటు సంబురాలు
- కాంగ్రెస్ సర్కార్ అవినీతిని సోషల్ మీడియాలో ఎండగడుతున్నరు
- బీఆర్ఎస్ ఎన్నారై (యూకే) విభాగానికి కేటీఆర్ ప్రశంసలు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధి కోసం త్రికరణశుద్ధితో పనిచేస్తూనే ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. తెలంగాణ సాధకులు గా, మాతృభూమిపై తమకుండే ప్రేమ, మమకారం, అభిమానం ఇంకెవరికీ ఉండబోవని స్పష్టంచేశారు. యూకే పర్యటనలో ఉన్న కేటీఆర్‌ను పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, యునైటెడ్ కింగ్‌డమ్ తెలుగు బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులు బుధవారం కలిశారు. తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, వ్యాపార నిర్వహణకు ఎదురవుతున్న సవాళ్లతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి నిరోధక విధానాలపై చర్చించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ అమలుచేసిన ప్రగతిశీల విధానాలు, తీసుకున్న పారిశ్రామిక అనుకూల నిర్ణయాలతో పదేండ్లపాటు తెలంగాణ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందని కేటీఆర్ చెప్పారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎన్నో సంస్థలు పెట్టుబడులు పెట్టిన విషయాన్ని ప్రస్తావించారు. యాపిల్, గూగుల్, మైక్రోసాఫ్ట్, అడోబ్ వంటి కార్పొరేట్ దిగ్గజాలకు తెలంగాణ నయా చిరునామాగా మారిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాలు, తీసుకొచ్చిన పారదర్శక విధానాలతో పారిశ్రామిక రంగంలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని గుర్తుచేశారు. తెలంగాణ గడ్డను ప్రేమించే వ్యక్తిగా అధికారంలో ఉన్నా లేకున్నా రాష్ట్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని స్పష్టంచేశారు. తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చే ప్రతి ఒక్కరికీ సాధ్యమైనంత సహకారం అందించాలని సమావేశానికి హాజరైనవారికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రగతికి బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేయాలని కోరారు.



లండన్‌లో తెలుగు బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతున్న కేటీఆర్

యూకేలో రజతోత్సవాలు

భారత రాష్ట్ర సమితి పురుడుపోసుకొని 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా త్వరలో యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లోనూ రజతోత్సవ సంబురాలను నిర్వహించనున్నట్టు కేటీఆర్ చెప్పారు. లండన్‌లో అక్కడి పార్టీ ఎన్నారై నేతలతో సమావేశమైన ఆయనను ఇంగ్లండ్‌లోనూ బీఆర్ఎస్ రజతోత్సవాలను ఏడాదిపాటు నిర్వహించాలని కోరారు. ప్రాంతాలకు అతీతంగా యూకే లో ఉన్న తెలుగువాళ్లంతా ఈ సంబురాల్లో పా ల్గొనేందుకు ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. కేటీఆర్ స్పందిస్తూ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశా ల మేరకు రజతోత్సవాలను యూకేలోనూ జరుపుదామని చెప్పారు. ఇప్పటికే వరంగల్ బహిరంగ సభ ద్వారా రజతోత్సవాలను అట్టహాసం గా ప్రారంభించగా, ఏడాది పాటు వివిధ రూపా ల్లో, దేశ విదేశాల్లో వేడుకలు కొనసాగించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా అమెరికాలోని డాలస్‌లో జూన్ 1న వేడుకలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. యూకేలోనూ భారీ ఎత్తున సంబురాలు చేయనున్నట్టు చెప్పారు. ఈ వేడుకలకు తనతోపాటు పార్టీ సీనియర్ నేతలు, తెలంగాణ కళాకారులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు.

తెలంగాణవాదానికి గొప్ప ప్రతీకలు..

బీఆర్ఎస్ యూకే ఎన్నారై విభాగం కార్యవర్గం మలిదశ ఉద్యమంలో తెలంగాణవాదానికి గొప్ప ప్రతీకగా నిలిచిందని కేటీఆర్ ప్రశంసించారు. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లలో జరిగిన తెలంగాణ అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసిందని మెచ్చుకున్నారు. ఉద్యమనేత కేసీఆర్ మార్గనిర్దేశనంలో దేశానికే రోల్ మోడల్‌గా మారిన తెలంగాణను ప్రపంచ వేదికలపై గొప్ప గా చూపించడంలో ఎన్నారై నేతలు సక్సెస్ అ య్యారని చెప్పారు. ఏడాదిన్నర నుంచి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దోపిడీ, అరాచకాలు, ప్రజలపై వేధింపులను బాగా ఎండగడుతున్నారని ప్రశంసించారు. ఇంగ్లండ్‌లో ఉన్న సోషల్ మీడియా వారియర్స్‌పై అక్రమ కేసులు పెట్టినా ఎక్కడా వెనక్కి తగ్గకుండా రేవంత్ ప్రభు త్వ దాష్టికాలను ప్రశ్నిస్తున్నారని కొనియాడారు. తెలంగాణలో ఏ మూలకు వెళ్లినా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తున్నదని తెలిపారు. ఖండాంతరాల్లో ఎక్కడ ఉన్నా తెలంగాణ ప్రజలకు జరుగుతున్న మోసాలను లేవనెత్తాలని ఎన్నారైలకు పిలుపునిచ్చారు. ఏడాదిగా తాము చేసిన కార్యక్రమాలను పార్టీ ఎన్నారై విభాగం కేటీఆర్‌కు వివరించింది. రజతోత్సవాల ప్రణాళికలను కూడా ఆయనతో పంచుకున్నది.

అమెరికాలోని డాలస్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఘనస్వాగతం పలికిన పార్టీ ఎన్నారై విభాగం నేతలు.
నార్త్ టెక్సాస్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎర్రబెల్లి, సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్ ఎన్నారై నేతలు

డెలావేర్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్. చిత్రంలో క్రాంతి, కిశోర్, రోహిత్‌రెడ్డి, బాలమల్లు

డాలస్‌లో బీఆర్ఎస్ ధూంధాం

తలమానికంగా రజతోత్సవం..

- సన్నాహక సమావేశాల్లో నేతలు
- హాజరయ్యే ప్రతినిధులకు ఏర్పాట్లు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): పార్టీ రజతోత్సవాల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎన్నారై విభాగం తలపెట్టిన డాలస్ సభపై సర్వత్రా ఆసక్తినెలకొన్నది. పార్టీ నేతలు, ఎన్నారై విభాగం నేతలు డాలస్ సభను తెలంగాణకు తలమానికంగా నిర్వహిస్తామని చెప్తున్నారు. జూన్ 1న డాలస్‌లో నిర్వహించనున్న సభకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. ఇప్పటికే పార్టీ ముఖ్య నాయకులు, మాజీ మంత్రులు, పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు డాలస్ సభ ఏర్పాట్లలో భాగంగా యూఎస్ఏలోని తెలంగాణ బిడ్డలను 'మీట్ అండ్ గ్రీట్' పేరుతో కలుస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ ప్రస్థానం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లపాటు అన్ని రంగాల్లో తెలంగాణ అద్వితీయంగా ముందుకు సాగిన క్రమం, ప్రస్తుతం నెలకొన్న స్థితిగతులపై ఎన్నారైల్లో విస్తృత చర్చ సాగుతున్నది. డాలస్ సభ నేపథ్యంగా యూఎస్ఏలోని పలు రాష్ట్రాల్లో సన్నాహక సమావేశాల నిర్వహణలో బీఆర్ఎస్ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల, బీఆర్ఎస్ యూఎస్ఏ అడ్వైజరీ చైర్మన్ మహేశ్ తన్నీరు సమన్వయం చేస్తున్నారు.

డెలావేర్‌లో బీఆర్ఎస్ ముఖ్యనేతలు

బీఆర్ఎస్ రజతోత్సవం నేపథ్యంలో బుధవారం డెలావేర్‌లో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిశోర్, క్రాంతి కిరణ్ చంటి, పైలట్ రోహిత్‌రెడ్డి తదితరులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో సాగిన సుదీర్ఘ ఉద్యమంలో మమేకమై తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో ఎన్నారైల పాత్ర కీలకమని కొనియాడారు. కేసీఆర్ నాయకత్వంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని వివరించారు.

ఏ లోటూ రాకుండా ఏర్పాట్లు: మహేశ్ తన్నీరు

అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఎన్నారైలకే కాకుండా హాజరయ్యే తెలంగాణ బిడ్డలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు బీఆర్ఎస్ యూఎస్ఏ అడ్వైజరీ చైర్మన్ మహేశ్ తన్నీరు 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు. పార్టీ చరిత్రలో తొలిసారిగా బయటి దేశంలో ఇంత భారీ ఎత్తున సభ నిర్వహించడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. ఎన్నారైలంతా కసికట్టుగా ఈ రజతోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ముందుకు వస్తున్నట్టు తెలిపారు. బుధవారం ఆయన డాలస్ సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ ఎన్నారై సెల్ కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల, శ్రీనివాస్ సురకంటి, అభిలాశ్ రంగినేని, పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ముఠా జయసింహ, ఆశిష్ యాదవ్, శ్రీనివాస్ సురభి, హరికృష్ణ దొర్నాల, నరసింహ నాగులవంచ తదితరులతో కలిసి పరిశీలించారు.

డాలస్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ ఏర్పాట్లలో మహేశ్ బిగాల, తన్నీరు

లండన్‌లో అనిల్ కూర్మాచలాన్ని పరామర్శిస్తున్న కేటీఆర్

లండన్‌లో అనిల్‌కూర్మాచలానికి కేటీఆర్ పరామర్శ

గుండె ఆపరేషన్ చేయించుకొని కోలుకుంటున్న అనిల్

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): మలి దశ తెలంగాణ ఉద్యమంలో యునైటెడ్ కింగ్ డమ్ (యూకే)లో తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించిన బీఆర్ఎస్ నాయకుడు, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలంను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పరామర్శించారు. అనిల్ కూర్మాచలం ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని, కోలుకుంటున్నారు. యూకే, యూఎస్ పర్యటనలో భాగంగా మంగళవారం లండన్ చేరుకున్న కేటీఆర్.. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా అనిల్ కూర్మాచలం ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనను ఎంతో అప్యాయంగా పలకరించి, ఆరోగ్యస్థితిపై వాకబు చేశారు. తన కుటుంబసభ్యులతో మాట్లాడి, వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తనను పరామర్శించడానికి వచ్చిన కేటీఆర్‌కు అనిల్ కూర్మాచలం ధన్యవాదాలు తెలియజేశారు. ప్రస్తు తం తన ఆరోగ్యం బాగానే ఉన్నదని చెప్పారు.

న్యూజిలాండ్‌కు ఎమ్మెల్సీ దేశపతి

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): న్యూజిలాండ్‌లో తెలంగాణ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 2న నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ప్రముఖ కవి, గాయకుడు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ బుధవారం వెళ్లారు. ఆక్లాండలో జరిగే వేడుకల్లో పాల్గొనాలని అసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్‌రావు కాసుగంటి ఆహ్వానం మేరకు వెళ్లారు.

గోపాల్‌ను స్వదేశానికి తీసుకొస్తా

మహబూబ్‌నగర్ అర్బన్, మే 28 : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం పెద్దదర్పల్లికి చెందిన గోపాల్ దుబాయిలో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. అతడిని స్వదేశానికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇచ్చిన మాట మేరకు.. బుధవారం దుబాయి వెళ్లిన ఆయన గోపాల్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న అడ్వకేట్, లీగల్ కన్సల్టెంట్ బొబ్బిలిశెట్టి అనురాధతో సమావేశమయ్యారు. గోపాల్ కేసుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా బెయిల్ వచ్చేలా కృషి చేయాలని న్యాయవాదిని కోరారు. అనంతరం గోపాల్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు.

ఇంత ఇసం పోసి పో!

మొదటిపేజీ తరువాయి...

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్భాటంగా ప్రకటించారు. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఒక్క ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చూస్తేనే కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ చూసినా వడ్ల కుప్పలు పేరుకుపోయి కనిపిస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో జోకిన వడ్లను కూడా తరలించడం లేదు. వర్షానికి తడిస్తే రైతులదే బాధ్యత అంటూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తుతున్నాయి. రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కోనుగోలు చేయాల్సి ఉందని రైతు సంఘాల నాయకులు చెప్తున్నారు. ఇందులో ఒక్క రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే దాదాపు 54 వేల పైచిలుకు మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందని అధికారులే తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు దారుణంగా మారాయి. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను హడలెత్తిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడంలేదని రైతు భోరున విలపిస్తున్నారు. ఇప్పటికైనా రైతుల గోడును అర్థం చేసుకొని, యుద్ధప్రాతిపదిక కొనుగోళ్లు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా షరతులు లేకుండా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

ఆవేదనతో రోడ్డెక్కిన అన్నదాతలు

కొనుగోలు కేంద్రాల్లో అధికారుల నిర్లక్ష్యంతో రైతులు విసిగివేసారిపోతున్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో రైతులు ఆందోళనకు దిగారు. ధాన్యం పండించి, కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే ఎందుకు కొనడంలేదని ప్రశ్నించారు. అధికారులను అడిగితే రేపుమాపు అంటూ సమాధానం చెప్తున్నారని, వర్షానికి తడిసి, ధాన్యం మొలకెత్తిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడు తమకు చావే శరణ్యమంటూ పురుగుమందు డబ్బాలు పట్టుకొని నిమ్మపల్లి ఎక్స్‌రోడ్డుపై ధర్నా చేశారు.

ప్రభుత్వంలో ఉన్న.. నా గతే ఇట్లున్నది

నాకు సొంత భూమి ఏడెకరాలు ఉంది. పదెకరాలు కౌలుకు తీసుకుని వరి వేసిన. దాదాపు 500 క్వింటాళ్ల వరకు పండించిన. పోయిన నెల 15వ తారీఖున వరి కోసిన. కల్లాల్లో వడ్లు పోసుకుని ఎదురుచూస్తున్న. నా లైన్ రాలేదని అంటున్నరు. వడ్లు మొత్తం ఇక్కడే ఉన్నయ్. 15 క్వింటాళ్ల వరకు తడిసి మొలకొచ్చినయ్. సగం జోకిన సంచులున్నయ్. మూడు జాగల్ల పెట్టింద్రు. ఏమైనా అంటే లైన్ అంటున్నరు. వర్షం పడితే దిగవడుతదని అధికారులకు చెప్పినం. ఎవరూ పట్టించుకుంటలేరు. జోకుడు ముందుకు సాగుతలేదు. ఇప్పటివరకు అనంతపల్లి గ్రామంల దాదాపు 25 లారీల వడ్లు ఉన్నయి. ఎవరిని అడిగినా రేపూమాపు అంటున్నరు. లేబర్ లేరని, హమాలీలు లేరని, లారీలు వస్తలేవని చెప్తున్నరు. అధికారులు వచ్చి చూసింది లేదు. మాది ఐకేపీ గ్రూపోళ్లకు ఇచ్చింద్రు. గ్రూపుసభ్యులు ఉండరు. ప్రభుత్వంల సింగిల్ విండో డైరెక్టర్‌గా ఉన్న నా పరిస్థితే ఇట్లున్నది. మిగతా రైతులు ఎంత గోసవడుతున్నరో అర్థం చేసుకోవచ్చు.

-అనపట్ల తిరుపతిరెడ్డి, అనంతపల్లి, కాంగ్రెస్ నాయకుడు, సింగిల్ విండో డైరెక్టర్

బ్లాస్టింగ్ చేస్తేనే ఆ టన్నెల్ తవ్వగలం

- ఎస్ఎల్‌బీసీ సాంకేతిక కమిటీ కీలక సూచన

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ విషయంలో సాంకేతిక కమిటీ ప్రభుత్వానికి కీలక సూచన చేసింది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో టీబీఎం పద్ధతిలో తవ్వకాలు అసాధ్యమని, డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ పద్ధతి (డీబీఎం) లోనే సాధ్యమని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఇన్‌లెట్ వైపు నుంచి టీబీఎం పద్ధతిలో తవ్వకాలు ఆపివేయాలని, డీబీఎంలోనే తవ్వకాలు జరపాలని సూచించింది. డీబీఎం పద్ధతికి అయ్యే ఖర్చును అంచనా వేయాలని, మిగతా పనులను ఎప్పటిలోగా పూర్తి చేస్తారో నిర్మాణ సంస్థ నుంచి ప్రణాళిక తీసుకోవాలని కమిటీ సిఫారసు చేసింది.

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల సంఘం అధ్యక్షునిగా బత్తుల

- నూతన కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం హైదరాబాద్‌లో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బత్తుల రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అట్ల శ్రీనివాస్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎస్ గౌతమి, జీ శశికళ, రమేశ్, జీ సునీల్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఆర్ మహేశ్, కే సంజీవులు, కే రామకృష్ణ, చంద్రమోహన్, కోశాధికారిగా జీ మహేందర్, మీడియా కన్వీనర్లుగా జీ నరేశ్, బీ రాకేశ్‌ను ఎన్నుకున్నారు.

దామగుండంలో అరణ్యరోదన

నిన్న హెచ్‌సీయూ... నేడు దామగుండం

ఆలనాపాలన లేక ఎండిన ట్రాన్స్‌లొకేట్ చెట్లు.. అడవి కుక్కల బారిన పడి జింకల మృత్యువాత

అమలు కాని చట్టాలు, రోదిస్తున్న జీవాలు.. సంబంధంలేదంటున్న జిల్లా అటవీ శాఖాధికారి

పర్యావరణానికి కాంగ్రెస్ సర్కారు గ్రహణం .. ప్రభుత్వంపై పర్యావరణవేత్తల తీవ్రఆగ్రహం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/ పూడూరు, మే 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో చెరువులను ఉద్ధరిస్తామని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పర్యావరణంతో చెలగాట మాడుతున్నది. నిన్నటికి నిన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లోని పచ్చదనాన్ని విధ్వంసం చేయడంతోపాటు మూగజీవాల ఉసురు తీసిన సర్కారు చర్యలు... ఇప్పుడు వికారాబాద్ జిల్లాలోని దామగుండం అటవీ ప్రాంతంలోనూ పునరావృతమవుతున్నాయి. నేవీరాడార్ సిగ్నల్ కేంద్రం కోసం అడవుల్ని అప్పగించిన ప్రభుత్వం ఆ మేరకు చెట్లు, మూగజీవాల రక్షణ చర్యల్ని గాలికొదిలేసింది. ఫలితంగా దశాబ్దాల చెట్లు వందలాదిగా ఎండిపోతుంటే పునరావాస చర్యలు లేక గూడు చెదిరిన జింకలు కుక్కలకు ఆహారంగా మారుతున్నాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాదిరిగానే ఇక్కడా సర్కారు అదే నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదని పర్యావరణవేత్తల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



వన్యప్రాణాలు చెల్లాచెదురు

వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నేనీరాడార్ సిగ్నల్ కేంద్రం ఏర్పాటు కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సుమారు 2,900 ఎకరాల అటవీ భూమిని అప్పగించింది. ఈ మేరకు దామగుండం రామలింగేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన 12 ఎకరాల భూమిని వదిలేసి, దాని చుట్టూ ఉన్న అటవీ ప్రాంతాన్ని నేవీ ఆధీనంలోకి తీసుకుంది. ఈ భూముల చుట్టూ ప్రహరీగోడ నిర్మించడంతో పాటు పలుచోట్ల భవనాల నిర్మాణ పనులు మొదలయ్యాయి. దీంతో అధికారులు, సిబ్బంది, ఇతరుల రాకపోకలు పెరగడంతో వన్యప్రాణులు చెల్లాచెదురవుతున్నాయి. జింకలన్నీ నీటి కోసం రామలింగేశ్వరస్వామి దేవాలయ పరిధిలోని కోనేరు వద్దకు వస్తున్నాయి. కుక్కలు మాటు వేసి, జింకల్ని వేటాడి చంపుతున్నాయి. ఇలా నెల రోజుల్లోనే నాలుగు జింకలు మృత్యువాతపడ్డాయి. కొన్ని జింకలు గాయపడితే అటవీశాఖ అధికారులకు తీసుకువెళ్లారని గ్రామస్థులు చెప్తున్నారు.

మాడిపోయిన పచ్చనిచెట్లు

నేవీ స్వాధీనం చేసుకున్న భూముల్లో రహదారులు, భవన నిర్మాణ పనులు చేపట్టిన చోట 4,500 చెట్లను తొలగించి, మరోచోట నాటాలని (ట్రాన్స్‌లొకేషన్) అటవీశాఖ నిర్ణయించింది. ఇప్పటికే 2,800 చెట్లను మరోచోటికి తరలించారు. వాటిని తరలించడమే తప్ప తిరిగి అవి జీవం పోసుకునేలా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తరలింపు సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఆ చెట్లన్నీ ఎండిపోయాయి. ఇంకా 1700 చోట్లను తరలించాల్సి ఉందని, వాటి పరిస్థితి కూడా ఇంతేనా అని పర్యావరణవేత్తలు ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంపై 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి.. వికారాబాద్ జిల్లా అటవీ శాఖాధికారి జ్ఞానేశ్వర్‌ను సంప్రదించగా.. చెట్లను తరలించడం వరకే తమ బాధ్యత అని స్పష్టంచేశారు. ఆ తర్వాత వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత నేవీ వాళ్లదేనని చెప్పుకొచ్చారు. వన్యప్రాణులకు సంబంధించి కుక్కలకు స్టెరిలైజేషన్ చేసే బాధ్యత ఆయా గ్రామ పంచాయతీలకు ఉంటుందని అన్నారు.

చెట్ల తొలగింపుతో కాలుష్యం

నేవి రాడర్ సిగ్నల్ కేంద్రం ఏర్పాటుకై భవన నిర్మాణాలు చేపడుతున్నారు. చెట్ల తొలగింపుతో గాలి, వాతారణ కాలుష్యం ఏర్పడుతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాము. పెద్ద చెట్లను తొలగించకుండా భవనాలు, రాడర్ నిర్మాణాలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రస్తుతం వేల సంఖ్యలో చెట్లను తొలగించి, మరోచోట నాటినా ఫలితంలేదు. అడవిలో ఫారెస్ట్, నేవీ అధికారులు కొత్త మొక్కలను భారీ సంఖ్యలో నాటలేరు. చెట్ల తొలగింపుతో భారీ కాలుష్యం ఏర్పడే అవకాశం ఉంది. అధికారులు దామగుండంలో అధిక సంఖ్యలో మొక్కలను నాటాలి.

-సత్యానందస్వామి, పూడూరు, వికారాబాద్ జిల్లా

అధికారులు పర్యవేక్షించడం లేదు

ఫారెస్టు అధికారులు ప్రతీరోజు పగలు, రాత్రి అడవిలో పరివేక్షించాలి. పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో 3 వేల ఎకరాలకు పైగా భూమి ఉంది. స్థానికులు వ్యతిరేకిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేవీ రాడర్ సిగ్నల్ కేంద్రం ఏర్పాటుకు ముందుకు వెళ్తున్నాయి. చెట్లను నరికి భవన నిర్మాణాలు జరుపుతున్నారు. అడవిలో జన సంచారం అధికం కావడంతో వన్యప్రాణులు బయటికి వచ్చి కుక్కలబారిన పడి ప్రాణాలను కోల్పోతున్నాయి. నెలరోజుల్లోనే అనేక జింకలు మృత్యువాతపడ్డాయి. అధికారులు పరివేక్షించి అడవిలో నీటి సౌకర్యం ఏర్పాటుచేసి, మూగజీవాలను కాపాడాలి. -శ్రీనివాస్‌గౌడ్, పూడూరు, వికారాబాద్ జిల్లా